మి నీ క థ

# "సా రీ భా నూ"

ఋషిశ్రీ కోరా

"క్రొత్త సినిమాలంతగా బాగోటంలేదు, ఏదైనా పాత సినిమా కెళ్దాం భానూ?" అంది సరోజ. పాతసినిమా కావటాన జనం అంతగా లేరు. ఆట మొదలవట్టానికింకా పది నిమిషాల టైముంది. హాలు లోపల సిగరెట్ కాల్చటం నిషేధం — అందుచేత సరోజను హాలులోపల కూర్చోమని చెప్పి బయటకు నడిచాడు భానుమూర్తి.


న్యూస్‌రీలు మొదలవటంతో హాలులోపల ప్రవేశించాడు భానుమూర్తి. సరోజ భుజం మీద చెయ్యివేస్తూ కూర్చున్నాడు. వెంటనే సరోజ వణుకుతూ "ఏయ్ మిస్టర్! ఇదేమిటీ? నా ప్రక్కన వచ్చి కూర్చున్నావ్? లే, ముందు నీకేమైనా మేనర్సుందా?" అని అరచింది. సరోజకు ఆవలిప్రక్కనున్న స్త్రీ "అన్ని సీట్లు ఖాళీలుండగా ఆడవాళ్ళ ప్రక్కకొచ్చి కూర్చో డానికెంత ధైర్యం?" అని అంది. పది మంది దాకా జనం ప్రోగయ్యారు. ఒకరు "స్కూ్కౢ్రీలూ జేమో"నసీ, మరొకరు "వెధవ! బాగా త్రాగొచ్చినట్లున్నాడండీ!" అనీ, వేరొకరు "పోలీసుల్ని పిలవండనీ" ఎవరి నోటికొచ్చింది వారంటున్నారు.

భానుమూర్తికి నోటివెంట మాట రాలేదు. అసలు తను కూర్చుంది సరోజ ప్రక్కనేనా? అని అనిపించి సరోజవైపు చూశాడు. సందేహం లేదు సరోజే! మరి.... మరి ఇదేమిటీ? పరుగులాంటి నడకతో హాలునుంచి బయటికొచ్చేడు భానుమూర్తి.

సరోజమీద బాగా కోపమొచ్చింది. కాలేజీలో నిలదీసి అడగాలని అనుకున్నాడు. మరురోజుదయం సరోజే భానుమూర్తి రూమ్‌కొచ్చింది.

"సారీ! భానూ!! రాత్రి నా పక్కన కూర్చుంది మా అత్తయ్య. ఆమె కూడా యీ సినిమాకే వస్తుందని నేనూహించ లేదు. మన విషయం కూడా ఇంట్లో తెలియదు కదా! అందుకని అలా ప్రవర్తించాను. నన్ను క్షమించు భానూ!" అంటూ అతని వళ్ళో వాలిపోయింది సరోజ. □

# అగ్నిశిఖ



ప్రఫుల్లచంద్ర

గుణశేఖర్ డిగ్రీ కాగితాన్ని చూచి నవ్వుకున్నాడు! కానీ.... ఆ డిగ్రీకోసం ఒకప్పుడు ఎంత ఆరాటం! ఎంత అప్పు? దాన్ని మొదటిసారి చేతుల్లోకి తీసుకున్నప్పుడు ఎంత గర్వం! స్వర్గాన్ని తెరిచే తాళంచెవి చేతిలో పడినట్టు!

కానీ....యిప్పుడు అది కాఫీ కాచుకోడానికి కూడా పనికిరాని కాగితపుముక్క! స్వర్గాన్ని కాదుకదా, ఆఫీసు తలుపులైనా తెరవడం చేత కాని ఉత్తి కాగితపు ముక్క! ఈ విషయం తెలియడానిక్కి అతనికి నాలుగేళ్ళు పట్టింది!

తల్లిదండ్రులకు తనపై ఎన్ని ఆశలు! తమ్మునికి ఎంత గౌరవం! చెల్లికి ఎంత అభిమానం! వారి ఆశల్నితీర్చి, వెలిగే వారి కళ్లలో తన నీడ చూచుకోవాలని ఎన్ని కలలు కన్నాడు తను!

కాని....ఉద్యోగం! ఉద్యోగం దొరికితే వారి ఆశల్లో కొన్ని అయినా తీర్చవచ్చు.

అమ్మ! కుటుంబానికి ఎంత సేవ చేస్తోంది! ఎంత కష్టపడుతోంది. కట్టుకోడానికి మంచి చీర అయినా లేదామెకు. ఆమెను సుఖపెట్టడం తన బాధ్యత! నాన్న మాత్రం? తమ సుఖం కోసం గొడ్డులా చాకిరీ చేయడం లేదూ? తన కుద్యోగం దొరకగానే — నాన్నగారూ! మీరు విశ్రాంతి తీసుకోండి—అని చెప్పేయాలి. తమ్ముడు—ఎంతవరకు చదువుతానంటే—అంతవరకూ చెప్పించాలి! చెల్లికి మంచి వరుడు....

కానీ....ఉద్యోగం?....ఈ జన్మలో దొరుకుతుందా?....

x x x

నెత్తిన పిడుగుపడినట్లు దిగ్భ్రాంతు డయాడు రామ్మూర్తి పంతులు. 'నేను చచ్చినా బాగుండిపోను' అనుకున్నాడు. అలాంటి కొడుకను కన్నందుకు—తన బాధ్యత ఏమీ లేనట్టు—భార్యను ఛాం, ఛూం అన్నాడు. ఇల్లు పీకి పందిరి వేసాడు! రెండో కొడుకు—విద్యాశేఖర్ కూడా—తన స్థాయిలో చిరచిరలాడిపోయాడు. కోపతాపాలకు అతీతురాలుగా కనిపించే అమ్మ కూడా ముక్కుతూ, మూలుతూ, పెద్దన్నయ్యను తిట్టుకోవడం — చోద్యంగా చూస్తూ వూరకున్నది సుమిత్ర ఒక్కతే!

అరగంట చిందులేసాక, టేబుల్ మీద ఫ్రేములో వున్న కొడుకు ఫోటోని నేలకేసి కొట్టి—అప్పటికీ కసితీరక రుసరుస లాడుతూ బయటకు పోయాడు రామ్మూర్తి. గాజు ముక్కలు ఏరి ఫొటోను భద్ర పరిచింది సుమిత్ర.

x x x

మొగం కడుక్కొని తువ్వాలుకోసం వెదుక్కుంటున్నాడు శేఖరం. తువ్వాలు దాచేసిన పద్మ ఎదురుగా కనిపించింది, నవ్వుతూ.

"ఏమి జేతురా రంగా!" పాట వ్లాందుకున్నాడు.

"నీ ఎదుట నే నుండ వేరే టవలెందుకూ?" కూనిరాగం తీస్తూ చెంగుతో అతని మొగం తుడిచింది పద్మ. సరాగా లాడుకుంటూ, టిఫినూ, టీ ముగించి పార్కుకి బయలు దేరారు దంపతులు. పార్కులో కూర్చున్నంత సేపూ దీర్ఘాలోచనలోనే వున్నాడు శేఖర్. అతని గాంభీర్యాన్ని గమనించి మౌనం వహించింది పద్మ.

అతడు ఆలోచిస్తున్నాడు....ఏడాది క్రితం జీవితానికీ, యిప్పటికీ ఎంత తేడా! తాను ధైర్యంగా ముందడుగు వేయకపోతే యింకా తాను నిరుద్యోగిగానే వుండేవాడు. పెళ్ళికాని అమ్మాయి,ఉద్యోగంలేని అబ్బాయీ—ఇద్దరూ ఒకలాంటివారే; తలిదండ్రుల గుండెలమీద కుంపట్లు!....తాను కుటుంబానికి దూరం అయినందుకు—తలిదండ్రులు మొదట్లో కోపగించినా.....యిప్పుడు.....యిప్పుడు?......ఏమో! అయినా పద్మకేం తక్కువ? భార్య కుండవలసిన అన్ని సద్గుణాలూ ఆమెలో వున్నాయి. ఆమె వల్లనే తనకు బ్యాంక్ ఉద్యోగం దొరికింది! కాపురం అన్యోన్యంగా హాయిగా సాగిపోతున్నది....అంతా బాగానే వుంది....మరి అమ్మా....నాన్నా....పద్మని కోడలుగా అంగీకరిస్తారా? కాలమే అన్ని సమస్యలకూ మందు! వీలుచూచుకొని వాళ్ళకు కాస్త ధన సహాయం చేస్తే....

"ఏమిటంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు? అమ్మా....నాన్నా గురించా?"


తల ఆడించాడు శేఖర్.

"నావల్ల కదా మీ కీ బాధ?"

"అలా అనకు పద్మా! నేను యీ మాత్రం అయినా హాయిగా వున్నానంటే—అది నీ








వల్లనే....వాళ్ళకూ్కడా ఏదైనా సాయం చేద్దామా....అప్పుడైనా వాళ్ళు మారుతారేమోనని...."

కాసేపు మౌనం వహించి, "లంచంతో, హృదయ పరివర్తన సాధించలేం" అంది. జీతంలో మిగిల్చి పంపడం ఎటూ కుదరదు. బోనస్ వచ్చినప్పుడు భార్యను ఒప్పించాలి—అని అప్పటికి మౌనం వహించాడు శేఖర్.

"కోపం వచ్చిందా? సారీ సర్!" నవ్వేసింది పద్మ. "డబ్బు పంపడంవల్ల వారు మారి, మనల్ని స్వీకరిస్తే మంచిదే. మన కుటుంబాలు ఒకటి కావడంకన్నా నేను కోరేదేముంది?.... అసలు మిమ్మల్ని యిక్కడకు లాక్కు రాడానికి ఒక కారణం వుంది....శుభవార్త"అంటూ బెల్లించి, లాలించి, సస్పెన్స్‌లో ముంచి తేల్చి అసలు విషయం చెప్పింది పద్మ.

తమ ఊళ్ళోనే ఏదో కంపెనీ—టైపిస్టు కావాలని—ప్రకటించిందట. ఉన్న ఊళ్ళోనే కదాని పద్మ అప్లై చేసి, ఇంటర్వ్యూకి వెళ్ళిందట. జాయిన్ అవమని యివాళే ఆర్డరు పంపారట వాళ్ళు. ఒక్కసారిగా చెప్పి ఆశ్చర్యంలో ముంచివేద్దామని భర్తకు అప్లై చేసినట్టు ముందుగా చెప్పలేదు పద్మ.

"నా జీతంతో కుటుంబం జరుపుకుందాం. మీ జీతంలోంచి నెలనెలా మూడొందలు పంపి, మిగిలినది దాచుకుందాం! సరేనా?"ఉత్సాహంగా అంది పద్మ.

మరో సందర్భంలో అయితే—తనతో చెప్పకుండా ఉద్యోగం సంపాదించుకున్నందుకు ఆమెమీద కోపం వచ్చేదే! కాని యిప్పుడు సంతోషించాడు శేఖర్.

తను కూడా ఆఫీసుకు వెళ్ళాలి కాబట్టి—యిల్లు చూచుకోడానికి పద్మ, ఆంటీని పిలిపించుకొంది. వంట, శుచి, శుభ్రతా, అణకువా—అన్నిటా ఆంటీ వాళ్ల మెప్పు పొందింది, అచిరకాలంలోనే.

జీతాలు వచ్చాక, ఎమ్. ఓ. చేశాడు శేఖర్. ఎమ్. ఓ. తిరిగివస్తుందని పందెం కట్టింది పద్మ. ఆమె అన్నట్టుగా వారం రోజుల్లో తిరిగివచ్చింది, ఎం. ఓ. కాదు! రసీదు!!

రాబోయే శుభదినాలకు సూచనగా భావించాడు శేఖర్.

"డబ్బుకి కులం లేదు!" నవ్వేసింది పద్మ; ఓడినందుకు ముద్దు చెల్లించి.

తమని ఆహ్వానిస్తూ తండ్రినుండి ఉత్తరం వస్తుందని వారం ఎదురు చూచాడు శేఖర్. కాని సుమిత్ర వ్రాసింది.

ఎమ్. ఓ. వచ్చినప్పుడు తండ్రి యింట్లో లేడట. రాత్రి వచ్చి, విషయం తెలిసి,—"పీడ డబ్బు ఎవడి క్కావాలి! పెళ్ళాం ముండ తంతోంది కాబోలు. రాజీకి లంచం పంపాడు. భ్రష్టుడు! గుమ్మంలో అడుగుపెడితే కాళ్ళు విరగ్గొడతా!"—అని చిందులేసాడట. ఎమ్.ఓ. తిరగ్గొట్టేద్దాం—అంటూ అగ్నిలో ఆజ్యం పోసాట్ట తమ్ముడు. కాని మర్నాడు పోస్ట్ మాన్ రాగానే గుట్టు చప్పుడు కాకుండా డబ్బు తీసుకున్నాట్ట! "నిన్న చిందులేసి యివాళ డబ్బు ఎందుకు తీసుకున్నారని" సుమిత్ర అడిగితే "పితృ ఋణం తీర్చుకోకుండా వాడు వచ్చే జన్మలో ఏ పందిగానో కుక్కగానో పుట్టాలనా నీ ఉద్దేశం? వచ్చే జన్మలో అయినా వాడికి సద్గతి కలగడానికి అవకాశం యిస్తున్నా! అంతే!" అన్నాట్ట.

తన అడ్రస్ యిన్నాళ్లకు తెలిసినందుకు సంతోషిస్తూ "వదినకు నా నమస్కారాలు అందజేయి. మీ రుభయులూ నా కాలేజీ అడ్రస్‌కు ఉత్తరాలు వ్రాస్తూ ఉండండి" అని ముగించింది సుమిత్ర.

ఉత్తరం చింపివేసాడు శేఖర్!

* * *

"ఈ ప్యాకెట్ మీద రేటు 6-38 వుంటే 7-50 చెబుతున్నారేం?"

"రేటు క్రింద స్థానిక పన్నులు అదనం అని వుంది చూడండి" వెటకారంగా నవ్వాడు షాపు వాడు.

"పన్ను ఎంత?"

అందరిలా—చెప్పినంతకు కొని వెళ్లక ఈ ప్రశ్నలన్నీ ఏమిటని చిరాకుగా చూచి "15 శాతం!" గొణిగాడు షాపువాడు.

"నిత్యావసర వస్తువులమీద అంత పన్ను ఉండదు."

"వెళ్ళి ప్రభుత్వాన్ని అడగండి!" ఈసడింపుగా అన్నాడు.

"ఈ వీధి చివరి స్థలం యింకో ప్రభుత్వానిదా? అక్కడ యిదే ప్యాకెట్టు 7 రూ. కిస్తున్నారు. 15 శాతం పన్ను లెక్కించినా దీని వెల 7-35 మించదు!"

"అమ్మా! తల్లీ!! వెళ్ళి అక్కడే కొనుక్కోండి!" వేళాకోళంగా చేతులు జోడించి నమస్కరించాడు షాపువాడు. ఇంత పెద్ద షాపుకి వచ్చి అర్ధరూపాయికోసం తగవుపడుతున్న ఆమెను చూచి చుట్టూ చేరిన వారంతా గొల్లున నవ్వారు. సర్రున వెనక్కి తిరిగింది పద్మ.

"ఎందుకు నవ్వుతారు? ఈ పెద్దమనిషి పట్టపగలు మన కష్టార్జితాన్ని దోచుకు తింటూ వుంటే నవ్వు వస్తోందా మీకు? మీలాంటి ఒక కష్టమర్ని యితగాడు అవమానిస్తోంటే నవ్వులాటగా వుందా మీకు? ఈ దోపిడీని కిక్కురుమనకుండా ప్రోత్సహించే మీరే—ప్రభుత్వం అధిక ధరలను అరికట్టాలని గొంతులు చించుకుని అరుస్తారు! సమ్మెలు చేస్తారు! మీరు ప్రభుత్వంలో ఒక భాగం కాదా? ఈ దోపిడీని అరికట్టడంలో మీ బాధ్యతే లేదా. ఇంకా నవ్వుతున్నారు! సిగ్గు లేకుండా!!" ఆమె రుసరుసలాడిపోతున్నది. తలలు వంచుకున్నా రందరూ!

"సరే. 7-50 కు బిల్లు యివ్వండి."

షాపువాడు తటపటాయించాడు. "సారీ! ఆ వస్తువుని అమ్మదలచుకోలేదు" సాధ్యమైనంత వినమ్రంగా అన్నాడు.


అంతవరకూ ఓ మూల వున్న విద్యార్థులు కౌంటర్ వద్దకు వచ్చారు.

"ఏయ్ మిస్టర్! మేం యింజనీరింగ్ విద్యార్థులం! తెలుసుగా మా సంగతి! ఆమె అన్నదాంట్లో తప్పేముంది? అమ్మడానికి కాకపోతే ఎందుకు పెట్టినట్టు ఈ షాపు? అసలు ధరలపట్టీ వేలాడగట్టాలి కదా? ఏదీ?....ఒరేయ్ లంబూ! మన హాస్టల్ వాళ్ళందర్నీ రమ్మని ఫోన్ చెయ్!"

అంతే. 7 రూ.కు బిల్లు రాసి, ప్యాకెట్ పద్మ చేతిలో పెట్టి—నమస్కారం పెట్టేసాడు అతడు.

"థాంక్యూ బ్రదర్స్ అండ్ సిస్టర్స్!" గాలిలో చేయి ఊపి అందరికీ కృతజ్ఞతలు చెప్పి ఠీవిగా బయటకు నడిచింది పద్మ. తల వంచుకొని అనుసరించాడు శేఖర్.






ముష్టి అర్ధరూపాయకోసం భార్య పబ్లిగ్గా యింత రగడ చేయడం అతనికి బాధగా వుంది. అవమానంగా తోచింది!

పద్మ తత్వం అంతే. ఒక్క పంకాయ తక్కువైతే కూరగాయల వాడితో జగడం ఆడుతుంది. పాలలో ఒక చుక్క నీళ్ళుంటే—వాణ్ణి కొట్టినంత పని చేస్తుంది. అయితే భార్య చాల కరెక్ట్ మనిషని—మొదట్లో మురిసి పోయాడు శేఖర్. కాని యిప్పుడిప్పుడే అతనికి భార్య "ఉత్తి పీనాసి. కక్కుర్తి మని"షని పిస్తోంది. ఆమెతో షాపింగ్ వెళ్లడానికి భయం వేస్తోంది. ఈ మనిషిని భరించగలనా—అని పిస్తోంది!

ఆ రాత్రి వెన్నెల్లో ఉలుకూ పలుకూ లేకుండా మంచంమీద దొర్లుతున్న భర్తని చూచి ఆశ్చర్యపోయింది పద్మ. ఇంతకు ముందు యిలాంటి వెన్నెల రాత్రులు వృధాగా పోయేవి కావు!

ఏమిటో గత ఆరు నెలలుగా—తాను ఉద్యోగంలో చేరిన లగాయితూ—భర్తలో మార్పు కన్పిస్తోంది. ఉత్సాహంలేదు. సరదా లేదు. మనోవ్యాధితో బాధపడుతున్నట్టు. తన ఉద్యోగం ఆయన కిష్టం లేదేమో!

మంచంమీద అతని ప్రక్కనే కూర్చుని మృదువుగా వీపు నిమిరి, "ఏమిటి ఆలోచిస్తున్నారు?" అంది. "మనసుని ఏదో దొలచివేస్తున్నది. చెప్పరూ?" అంది ముందుకు వంగి, గోముగా.

మల్లె సువాసనలో ఉక్కిరి బిక్కిరి అయి, ఆమెను హృదయంమీదకు లాక్కున్నాడు. కాని యింతలోనే దిగులు అతనిని మింగేసింది. పది నిమిషాలు బ్రతిమాలించుకొని—"ఎల్లుండి తమ్ముడి పెళ్ళట" అన్నాడు ఎటో చూస్తూ. "మీకెలా తెలిసింది?" అని ఆమె అడగలేదు. "రక్షించింది" అనుకొని నిట్టూర్చాడు శేఖర్.

ఆమె ఏమీ అనలేదు. ఆమె మొగంలో దరహాసం తొలగిపోలేదు. మరికొంత ధైర్యం తెచ్చుకున్నాడు శేఖర్.

"నువ్వు అన్నట్టు లంచంతో హృదయ పరివర్తన సాధించలేకపోయాం. డబ్బు ఓడిన చోట ప్రేమ గెలువవచ్చు...." అన్నాడు నమ్మకంగా.

అతని మనస్తాపం గ్రహించిందామె. "అంటే—పిలువని పేరంటానికి వెళ్తానంటారు! ప్రేమతో వాళ్ళని మార్చగలమన్న

నమ్మకం మీకుంటే యింత ఆలోచన దేనికి? వెళ్ళండి. కాని నాకు దక్షయజ్ఞం కథ జ్ఞాపకం వస్తోంది" అంది స్నేహ మధురస్వరంతో.

ఆమె అంత సులభంగా ఒప్పుకుంటుంది—అనుకోలేదు శేఖర్. చిన్న పిల్లాడిలా తొందర పడిపోయాడు. "ఇప్పుడు. వెళ్తున్నది మగవాడు!" అన్నాడు ధీమాగా.

"పార్వతి స్త్రీ గనుకనే భర్తకు జరిగిన అవమానాన్ని సహించలేక తండ్రిని ఎదిరించింది. మరి మీ రేం చేసుకువస్తారో చూస్తానుగా" నవ్వేసింది పద్మ.

ఆమెను హత్తుకొని "మై స్వీట్ గాళ్" అన్నాడు శేఖర్.

※ ※ ※

"ఏ ముఖం పెట్టుకు వచ్చా డీ ద్రోహుడు? పొమ్మను" భార్యను హుంకరించాడు రామ్మూర్తి. గుమ్మంలోనే ఆగిపోయాడు శేఖర్.

ఇంట్లో—పెళ్ళికి వచ్చిన చాలా కొత్త మొగాలు కనిపించాయి. అందరూ వింతగా చూస్తున్నారు. కొందరు గుసగుస లాడుతున్నారు.

"వెళ్ళు నాయనా! రసాభాసు చేయకు" కన్నీళ్ళతో వేడుకొంది కన్నతల్లి!

గలాభా విని గదిలోనుండి బయటకు వచ్చిన పెళ్ళికొడుకు గుమ్మంలో అన్నను చూచి, పాముని చూచినట్లు హడావుడిగా లోనికి పోయాడు....కన్నీళ్ళు బలవంతంగా ఆపుకొని, గుండె చేతో నొక్కుకుంటూ భారంగా కదిలాడు శేఖర్.

దొడ్డి గుమ్మంలోంచి బయటపడి, అన్నను వెంబడించి వీధి మలుపు తిరిగాక అతనిని ఆపింది సుమిత్ర. ఆమె బలవంతంమీద అతడు అక్కడే వున్న లాడ్జిలో మకాం పెట్టాడు. వీలున్నప్పుడల్లా సుమిత్ర అతనిని కలుసుకొనీ విశేషాలు చెప్పేది.

వివాహం అయ్యాక స్వీట్లు తీసుకొని వచ్చింది సుమిత్ర.

మూడు రోజులుగా కుక్కిన పేనులా, తేలుకుట్టిన దొంగలా, లాడ్జిలో వుంటున్న శేఖర్‌కి చెల్లి చెప్పిన విషయాలు మరింత క్లేశాన్ని కలిగించాయి. ఇంట్లో అందరూ అతనిని తిడుతున్నారట. ఈ అనాచారపు కొంపలోనికి తమ పిల్లను పంపమనీ, అల్లుడు యిల్లరికం వస్తేగాని వివాహానికి అంగీకరించమనీ, అప్పుడైనా సగం కట్నమే యిస్తామనీ వియ్యాలవారు నానా భీభత్సం చేసారట. తమ్ముడు పూర్తిగా వాళ్ళ పక్షమే మాట్లాడడం మొదలుపెట్టాడట.

"ఇల్లరికం వస్తే ఉద్యోగం ఇప్పిస్తానని మామగారు చిన్నన్నను వశపరచుకున్నారులే.... ఛీఛీ....ఏం మనుష్యులో" ఆవేశంగా అంది సుమిత్ర.

"నా వల్లనే కదా మన కుటుంబాని కింత అవమానం!" కుమిలిపోయాడు శేఖర్.

"ఛీ! ఆడదానిలా ఏడుస్తావేం అన్నయ్యా! నీకు నచ్చిన పిల్లను నువ్వు చేసుకున్నావ్. నీ తప్పేం వుంది. వివాహం అయిపోయింది. బంధువులంతా వెళ్ళిపోయారు. కనుక ఇప్పుడు నువ్వు యింటికి వచ్చేయ్! నాన్నని కడిగేయ్! పరాయివాళ్ళతో చేరి మానవత్వం మరిచి తాను కూడా నీ నెత్తిన రాళ్ళు రువ్వుతున్నాడు! చిన్నన్నకు ఎంత నిక్కు పెరిగిందను కున్నావ్?" ఉక్రోషం అంతా ఒలకబోసింది సుమిత్ర.

నోట్లో నాలుక లేని తన చెల్లి సుమిత్రేనా యీమె? అని ఆశ్చర్యపోయాడు శేఖర్.

"ఒదిన మంచిదేనా అన్నయా? ఒకసారి ఆమెను చూడాలని ఉంది."

"మీ వదిన దేవతమ్మా! ఆమెను చూస్తే—మనవాళ్ళే—అనుకుంటావ్. నా కోసం శాఖాహారిగా మారిపోయింది. నా కోసం ఏదైనా చేస్తుంది....నిన్ను తప్పక ఆదరిస్తుంది.... సెలవుల్లో ఒకసారి రా. కాని నాన్నకు తెలిస్తే ....అన్నట్లు నాన్న మరో రెండు నెలల్లో రిటైర్ అవుతారు కాబోలు. తమ్ముడు యిల్లరికం వెళ్ళిపోతే కుటుంబం ఎలా గడుస్తుంది?...." అతని కళ్ళు మళ్ళీ నిండిపోయాయి.






# సూపర్ రిన్‌తో తళతళలాడే తెలుపు



## మరే ఇతర డిటర్జంట్ బిళ్ల లేదా బార్ కంటే తెలుపు

మీ బట్టలకు కళ్లు తిప్పుకోలేనంత తెల్లదనం—క్రమం తప్పకుండా సూపర్ రిన్‌తో ఉతికితే వాటి తెల్లదనం అద్వితీయం. మరే ఇతర డిటర్జంట్ బిళ్ల లేదా బార్ కంటే మరింత తెల్లటి తెలుపునిస్తుంది సూపర్ రిన్. ఎందుకంటే, సూపర్ రిన్‌లో తెలుపు చేసే శక్తి ఎక్కువ.




దీని తెలుపు చేసే శక్తిని మీకు మీరే ఋజువు చేసుకోండి!

మరే ఇతర డిటర్జంట్ బార్‌తోనైనా ఉతికినది



సూపర్ రిన్‌తో ఉతికినది

హిందూస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పాదన.

సూపర్ రిన్‌లో తెలుపు చేసే శక్తి ఎక్కువ

లింటాస్-RIN.40-1811 TL

"నీతో తెగతెంపులు చేసుకున్న కుటుంబం గురించి నీ కెందు కన్నయ్యా యీ దిగులు!"

"పైకి కఠినంగా వున్నారు గాని నాన్నకు మాత్రం బాధ లేదా?"

"ఈపాటి సహృదయత నాన్నకుంటే ఎంత బాగుండును! నాన్నకు నువ్వు అక్కర్లేదుగాని, నెల నెలా నీవు పంపే డబ్బు మాత్రం కావాలి!"

శేఖర్—సుమిత్ర కోరినట్టు — యింటికి వెళ్లనూ లేదు. నాన్నను కడిగివేయనూ లేదు. ....ఆ రాత్రే ఊరికి వెళ్ళిపోయాడు.

* * *

6 నెలలు గడిచాయి.

బ్యాంక్‌లో పని పూర్తి చేసి బయటకు వస్తున్న శేఖర్ ఎదురుగా పద్మను చూచి తొట్రుపడ్డాడు. మొగం మాడిపోయింది. లేని నవ్వు తెచ్చుకొని "ఏమిటిలా హటాత్తుగా వూడిపడ్డావ్? ఆరోగ్యం బాగుందా?.... ఒక్కదానివే వచ్చావా?...."

హటాత్తుగా మాట పడిపోయినట్టు ఆగిపోయాడు శేఖర్, ఇక ప్రశ్నలు లేక! అన్ని ప్రశ్నలకూ ఒకే సమాధానం. "పార్కుకు పదండి."

పార్కులో కూర్చున్నారు. ఆమె ఏమీ మాట్లాడలేదు. అతడు నిశ్శబ్దాన్ని భరించలేక పోతున్నాడు. తలవంచుకొని "రెండు నెలలుగా మీకు డబ్బు పంపలేక పోయాను" అన్నాడు.

"డబ్బుకోసం వచ్చాననుకున్నారా?"

ఆమె మొగం చూసాడు. తడబడ్డాడు. తల వంచుకున్నాడు. ఆమె మరి మాట్లాడలేదు. "ఎందుకు వచ్చావ్?" అని అడగలేక పోతున్నాడు. ఉత్కంఠ భరించనూ లేకపోతున్నాడు. "మాట్లాడు...." అన్నాడు పిరికిగా.

"మీరు కావాలనే బదిలీ చేయించుకున్నారు కదూ?" మొదటి బాణం!

"మనకోసం అద్దెయిల్లు చూడకుండా, మీ వాళ్ళ యింట్లోనే వుంటున్నారు కదూ!" రెండో బాణం!

"నన్ను .... ఒదిలేసారా? ...." మూడో బాణం!

ఇక తట్టుకోలేకపోయాడు శేఖర్.

"ఛీ! ఏడవకండి అసహ్యంగా.... ధైర్యంగా చెప్పండి.... నన్నేం చేస్తారు?—నన్నేం చేయమంటారు?"

అది పార్కు కాబట్టి భోరున ఏడ్వలేకపోయాడు శేఖర్! చేతిరుమాలు అందించింది ఆమె. నిశ్శబ్దంగా జారుతున్న కన్నీళ్లు ఒత్తుకున్నాడు.

"రేపు.... రేపు.... చెబుతా...." అన్నాడు తడుముకుంటూ.

"సరే! రేపు బ్యాంకి సెలవు కదా! 10 గం॥కు ఈ యింటికి రండి" ఎడ్రస్ వ్రాసి వున్న కాగితం అతని చేతిలో పెట్టి లేచిందామె. విస విస నడిచిపోతున్న ఆమెను భీత హరిణంలా చూస్తూ నిట్టూర్చాడు శేఖర్.

* * *

వాలుకుర్చీలో విశ్రాంతి తీసుకుంటున్న రామ్మూర్తి పంతులు—తమ యిల్లు వెదుక్కుంటూ వచ్చిన మహాలక్ష్మిలా గుమ్మం వద్ద నిలచిన ఆమెను చూచి—"ఎవరమ్మా? ఏం కావాలి?....లోపలికి రా!" అన్నాడు ఆప్యాయంగా.

వంటగదిలో నడుము వాల్చిన కామాక్షమ్మ "ఎవరూ?" అంటూ ముందు గదిలోనికి వచ్చింది. చేతిలోని నవల కుర్చీలో పడేసి సుమిత్ర కూడా లోనికి వచ్చింది.

ఆమె సంశయిస్తూ లోనికి వచ్చి అందర్నీ పరిశీలనగా చూస్తూ ఉండిపోయింది.

"అలా కుర్చీలో కూర్చో అమ్మాయీ! ఎవరు కావాలి?"

ఆమె పొందికగా కూర్చుంది. ఆ వినయమూ, వందనమూ కామాక్షమ్మకు నచ్చాయి.

"నేను మీ పెద్దబ్బాయి కోసం వచ్చాను" అంది దిక్కులు చూస్తూ.

"అయ్యో! వాడీ ఉదయమే పని ఉందంటూ ఊరెళ్ళాడు.... ఇంతకూ నీవు వాళ్ళ బ్యాంకిలో పని చేస్తున్నావా?"

"మాది ఈ ఊరు కాదు లెండి."

"ఎవరు నువ్వు? వాడితో ఏమిటి పని?"





"నేను...."

"నీవు!"

"మీ పెద్దకోడల్ని!"

అదిరిపడి లేచాడు రామ్మూర్తి. ఆమె కూడా లేచి నిలబడింది.

ఒక క్షణం నోట మాట రాలేదు రామ్మూర్తికి.

తరువాత "ఫో బయటికి!" గర్జించాడు.

ఆమె కదలలేదు. అదర లేదు, బెదర లేదు. "మా వారు నాతో మాట్లాడడానికి వస్తానని రాలేదు" అంది నిశ్చలంగా.

"మంచిపని చేసాడు....వా డింట్లో లేడంటున్నాను కదా. ఫో! సుమిత్రా! ఆ కుర్చీ అక్కడ నుండి తీసేసి, శుద్ధి చేసి, ఎండలో పెట్టు.... తరువాత స్నానం చెయ్" ఆర్భాటంగా అన్నాడు.

ఆతని అరుపులు విని దారిన పోతున్న వాళ్ళు కూడా ఆగి చోద్యం చూస్తున్నారు. జనాలు గుమ్మంలో గుమిగూడడం చూచి ఢడేల్‌మని తలుపులు మూసేసాడు, రామ్మూర్తి.

తలుపులు మూసేస్తే పరువు నిలబడుతుంది కాబోలు—నవ్వుకుంది సుమిత్ర. గుండెలో మంట రేపినట్టుంది అతనికి.

"ఏమేయ్! కుర్చీ తీసేమంటూంటే నీక్కాదూ?" మళ్ళా అరిచాడు.

అంతవరకూ నిలచివున్న పద్మ తాపీగా కుర్చీలో కూర్చుంది!

"ఒసేవ్....ఒసేవ్... పొమ్మంటూంటే నీక్కాదూ?" ఉద్ధృతంగా ఆమె మీదకు వెళ్ళబోయి హటాత్తుగా ఆగిపోయాడు రామ్మూర్తి.

"చూడండీ! నాగరిక లక్షణం కాదు.... మీరు కాసేపు నిదానిస్తే సమస్యను సౌమ్యంగా పరిష్కరించుకుందాం!"

"అఘోరించు!"

"నిన్న మీ అబ్బాయిని అడిగిన ప్రశ్నలే అడుగుతున్నా....నన్ను ఏం చేయదలచుకున్నారు?"

గది ఆ మూల నుండి ఈ మూలకు పచార్లు చేస్తున్న రామ్మూర్తి ఆగి "వాడు నిన్ను ఒదిలేసాడు. సమాధానం దొరికింది కదా. ఇక ఫో" అన్నాడు....పిడుగు లాంటిది—అనుకున్న ఆ వార్త ఆమెమీద ఏ ప్రభావమూ చూపలేదు. ఆశ్చర్యపోయాడు రామ్మూర్తి. ఔనులే. వీళ్ళకు ఒక మొగుడయితే కదా! అని ఈసడించుకున్నాడు.

ఆమె నవ్వింది!

కళ్ళు నులుముకొని మరీ చూచాడు రామ్మూర్తి. అవును ఆమె నవ్వుతోంది. "మొగుడు వదిలేస్తే నవ్వు వస్తోందా?" అని రుసరుసలాడిపోయాడు రామ్మూర్తి!

"మీరు ఏమీ తెలియని అమాయకులో, అన్నీ తెలిసిన మోసగాళ్ళో అర్థం కావడం లేదు!" అంది నవ్వుతూ.

ఉగ్రుడైపోయాడు రామ్మూర్తి. తాను మోసగాడా!!

పట్టరాని దురాగ్రహంతో "ఏం కూసావ్?" గర్జిస్తూ వెళ్ళి ఆమె జుత్తు దొరక బుచ్చుకున్నాడు.

సుమిత్ర వద్దు వద్దని వారిస్తూనే వుంది. కామాక్షమ్మకు భర్త ఆగడం తెలిసిందే. ఇలాంటి సందర్భాలలో ఆమెకు మౌనమే శరణ్యం! అయితే ఈసారి భర్త సాహసం ఆమెకు దిగ్భ్రమ కలిగించింది.

"ఒదలండి!" సింగిలా గర్జించింది పద్మ.

అప్పటికి కాస్త స్పృహ కలిగింది అతనికి. షాక్ తిన్నట్టు ఆమెను ఒదిలేసి కాస్త దూరంగా నిలచి మైలపడిపోయిన చేతుల్ని విదుపుకోవడం మొదలుపెట్టాడు. చేతుల్ని నరుక్కుందామా అన్నంత ఆవేశం కలిగింది అతనిలో. కాని స్వంత చేతులు కదా! "ఛీఛీ వెధవ రొష్టు వెధవ సంత!" అంటూ నోటికి పైనన్ను యిచ్చేసి యధాలాపంగా ఆమెవైపు చూచాడు. అంతే!

నిప్పులు చెరుగుతున్న ఆ కళ్లను చూడలేక —అంత ఉగ్ర నరసింహమూర్తి తల వంచి, కుర్చీలో కూలబడ్డాడు!

"రామ్మూర్తిగారూ! మీ ఆర్భాటానికి అదిరిపోడానికి నేను మీ అబ్బాయిని కాను! కోడల్ని!

ఈ క్షణంలో మిమ్మల్ని అరెస్టు చేయించ గలను! తలుపు తెరిచి చూడండి. బయట పోలీస్ ఇన్స్పెక్టర్ వున్నాడు—అంతా గమ నిస్తూ! కాని పశువుల పట్ల కూడా మానవత్వం ప్రదర్శించడం నా తత్వం. మిమ్మల్ని అరెస్టు చేయించను లెండి. ఇక నోరు మూసుకొని నేను చెప్పేది వినండి...." అపర చండికలా గర్జించిం దామె.

నోరు తెరచి ఊరుకున్నాడు రామ్మూర్తి, బోనులో సింహంలా! అతని అవస్త చూచి కామాక్షమ్మ నోరు నొక్కుకుంటే వెంటనే వదినకు థాంక్స్ చెప్పా లనిపించింది సుమిత్రకు!

కోపాన్ని అదుపులో పెట్టుకొని, సాధ్యమై నంత సౌమ్యంగా "మాది గుళ్ళో పెళ్ళి అయితే, మాంగల్యాన్ని తెంపివేసి—నీ వెవరో నాకు తెలియదు. పో—అనగల సమ ర్థులే మీరు! కాని మాది రిజిస్టర్ పెళ్ళి! 'వది లేసాడు'—అన్నంత తేలికగా ఈ బంధం పోదు. అర్ధరూపాయి మోసాన్నే సహించని నేను—నా జీవితాన్నే దోపిడీ చేసిన వ్యక్తిని తేలికగా వదిలిపెడతానని ఎలా అనుకున్నారో ఆయన! నేను కూర్చుంటేనే మీ కుర్చీ మైల పడినట్టు ఆర్భాటం చేస్తున్నారే! మీ అబ్బాయి నా కులంవల్ల సంపాదించుకున్న ఉద్యోగం మైలపడిపోలేదా? ఆ ఉద్యోగం యిచ్చే జీతం అంటరానిది కాదా? జీతంమీద యిన్ని పసుపు నీళ్ళు చల్లి శుద్ధిచేసి వాడుకుంటున్నారు కాబోలు! నా మీద కూడా అట్లానే పసుపునీళ్లు చల్లి నన్ను మీలో చేర్చుకోరేం? నాలో మలినం లేదు రామ్మూర్తిగారూ! మీ మనసులోనే వుంది మలినం అంతా! ముందు మీ బుద్ధిని శుద్ధి చేసు కోండి...."

ఆగి కాసేపు సుమిత్రమీద దృష్టి నిలి పింది పద్మ. కళ్లతోనే నవ్వి థాంక్స్ చెప్పింది సుమిత్ర.

దృష్టి మరల్చుకొని "పొమ్మంటే, చూరు పట్టుకొని వేలాడేదాన్ని కాను! నిన్ననే ఆయన ఆలా చెప్పి వున్నట్టయితే యిప్పుడు మీ యింటికి వచ్చేదాన్నే కాను. అలా చెప్పడానికి ఆయనకి ధైర్యం చాలలేదు. ఇప్పుడుకూడా ఇంట్లో లేకుండా పారిపోయారు. సరే. ఆయన వచ్చాక ఒక విషయం చెప్పండి. వదిలేసాను—అని నోటి మాటగా అంటే కుదరదు. కోర్టుద్వారా విడాకులు యివ్వాలి. ఆయన అందుకు సుముఖంగా లేకపోతే— మోసం చేసారని నేనే కోర్టుకెక్కి విడాకులు పొందుతా. విడిపోయాక నేను చేయబోయే పని కూడా చెబుతున్నా. ఖాయమైంది కాబట్టి తన ఉద్యోగం ఎవరూ పీకేయలేరు—అని ఆయనా, మీరూ అనుకుంటున్నారు కాబోలు. నా కులంతో వచ్చిన ఉద్యోగం నా కులంతోనే పోవాలి. అది న్యాయం. ఆ న్యాయం సాధించడానికి నే నెంత దూరం అయినా వెళ్తా. ఆ విషయం గుర్తుం చుకోమని ఆయనతో చెప్పండి. ఆకలి కడుపు లతో—కులాలన్నీ ఒకటే అని ఆదర్శాలు వల్లించి, ఆకలి తీరగానే—మీరు వేరు; అసింటా....అసింటా....—అనే కుంతలకూ, తలిదండ్రులకు భయపడి భార్యల్ని వదిలేసే పిరికిపందలకూ, కుహనా సంస్కారులకూ తగిన పాఠం నేర్పుతా....ఈ ప్రయత్నంలో నేను నాశనం అయినా సరే....ఊబిలో దిగబడి పోకుండా వేలాది నా సోదరీమణులను రక్షిస్తా...." సర్వ మాలిన్యాలనూ శుద్ధిచేసే అగ్నిశిఖలా జ్వలిస్తూ—తలుపులు తెరచుకొని ధీర లలితంగా ముందడుగు వేసింది పద్మ.

రామ్మూర్తి పంతులు యింకా చేతులు విదుపుకుంటూనే వున్నాడు!





# తూరుపు దారి



## కాసారపు సంజీవ్

ఠంగ్! ఠంగ్! ఠంగ్!!

ఎక్కడో మూడు గంటలు కొట్టిన శబ్దం.

వరండాలోంచి వస్తోన్న లైట్ వెలుగు సన్నగా ప్రసరిస్తోంది, సెల్‌లోకి.

టక్! టక్! టక్! టక్!

సెంట్రీ బూట్ల చప్పుడు, ఆగి ఆగి లయ బద్ధంగా.

ఆ గదిముందే ఆగాడు సెంట్రీ. గదిలోకి చూశాడు.

చువ్వల వెనుక....

గోడ నానుకొని కూర్చున్నాడతను, వేమన భంగిమలో.

"ఏమిటి రాంబాబూ! ఇంకా నిద్రపోలేదా!!" జాలిగా అంటున్నాడు సెంట్రీ అతడ్నే నిశితంగా